

ఉద్యోగోన్నతి లేఖలు పొందిన కార్మికులతో అధికారులు

## ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత

- రక్షణతో ఉత్పత్తి సాధించాలి
- డీవైజీఎం అబ్దుల్ ఖాదర్
- ఆర్కే-5 గనిలో 185 మందికి జనరల్ మజ్దూర్లుగా పత్రాలు

శ్రీరాంపూర్, అక్టోబర్ 10 : కార్మికులు జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగోన్నతి పొందడంతో మరింత బాధ్యత పెరిగిందని డీవైజీఎం అబ్దుల్ ఖాదర్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5 గనిలో మంగళవారం 185 మంది బదిలీ వర్కర్లకు జనరల్‌మజ్దూర్లుగా ఉద్యోగోన్నతి లేఖలను ఆయన అందించారు. ఈ సందర్భంగా డీవైజీఎం మాట్లాడుతూ.. గనిలో ఇంతపెద్ద మొత్తంలో ఒకేసారి జనరల్‌మజ్దూర్ లేఖలు రావడం ఇదే మొదటిసారి అని అన్నారు. కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. సింగరేణిలో ఆర్కే-5 గనిని ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలుపాలని కోరారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ కార్మికుడు రూపొందించిన బతుకమ్మ పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ ఆఫీసర్ శివయ్య, సీనియర్ పీవో రణదీప్‌గౌడ్, సహాయ మేనేజర్ రాందాస్, అండర్ మేనేజర్ హేమంత్, నవీన్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18న దసరా అడ్వాన్స్ చెల్లింపు..

రెబ్బెన/శ్రీరాంపూర్, అక్టోబర్ 10 : సింగరేణి ఉద్యోగులకు 18న దసరా అడ్వాన్స్ రూ.25 వేలు చెల్లించనున్నట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల ఖాతాలో రూ.25 వేలు, టెంపరరీ ఉద్యోగులకు రూ.12,500 పండుగకు ముందు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులందరూ దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ మొత్తాన్ని తిరిగి కార్మికుల వేతనాల నుంచి నెల నెలా రికవరీ చేయనున్నట్లు వెల్లడించారు.

# అట్టహాసంగా జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు

ఆరు రీజియన్ల నుంచి తలపడుతున్న రెస్క్యూ జట్లు

- ఆర్జీ-2లో ప్రారంభించిన డైరెక్టర్లు, డీడీఎంఎస్
- ప్రతిభ చూపిన వారు ఆల్ ఇండియా పోటీలకు..
- 150 మందిపైగా సభ్యులు, జీఎంలు, ఇతర అన్ని విభాగాల అధికారులు
- కోలాహలంగా రెస్క్యూ స్టేషన్



సభ్యులను పరిచయం చేసుకుంటున్న డీడీఎంఎస్ ఉమేశ్ ఎం సావర్కర్, డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి

యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 10 : సింగరేణి 52వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు ఆర్జీ-2లో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏరియాలోని రెస్క్యూ స్టేషన్‌లో డైరెక్టర్ (పీ అండ్‌పీ)జీ వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్‌వీకే శ్రీనివాస్, హైదరాబాద్ జోన్-1 డీడీఎంఎస్ ఉమేశ్ ఎం సావర్కర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా వివిధ డివిజన్ల నుంచి ఆరు టీములు పోటీల్లో పాల్గొన్నాయి. ముందుగా సంస్థ డైరెక్టర్ రెస్క్యూ జెండా ఆవిష్కరించి, రక్షణ ప్రతిజ్ఞ చేశారు. రెస్క్యూ టీం సభ్యులను పరిచయం చేసుకొని, గౌరవ వందనం స్వీకరించారు. డ్రా పద్ధతిలో జట్లకు నంబర్లను కేటాయించారు. వాటి ప్రకారం పోటీల్లో పాల్గొన్న ఆరు జట్లు వరుసగా పరేడ్, డ్రిల్, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరీ అంశాలపై తమ ప్రతిభ చాటాయి. సింగరేణి వ్యాప్తంగా సుమారు 150 మందిపైగా రెస్క్యూ సభ్యులు, జీఎంలు, ఇతర అన్ని విభాగాల అధికారులు రావడంతో రెస్క్యూ స్టేషన్ కోలాహలంగా మారింది. గనిలోపల ప్రమాదంలో చిక్కుకున్న బాధితులను రక్షించడం, బండరాయి పడ్డ ప్రాంతానికి చేరుకొని బాధితుడికి అపాయం కలుగకుండా బండ తొలగించడం, నీటి ప్రవాహాన్ని ఆరికట్టడానికి ఇసుక వాల్వ్ కట్టడం, ప్రమాద స్థలంలో అడ్డుగా ఉన్న ఇనుప రాడ్లు, కర్రలను తొలగించడంతో పాటు ఆపదలో ఉన్న బాధితుడికి ఆత్మస్థైర్యాన్ని ఇస్తూ ఆక్సిజన్ అందించే ప్రదర్శన ఆకట్టుకున్నది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గనిలో ప్రమాదం జరిగినప్పుడు కార్మికులను రక్షించడంపై రెస్క్యూ అండ్ రికవరీ పోటీలను మూసివేసి, 7 ఎల్ఈపీ గనిలో సభ్యులు పోటీల్లో రెస్క్యూ సభ్యులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఆర్జీ-1, 2, 3 అండ్ ఏపీఏ, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్ జట్లు పాల్గొన్నాయి. ఇందులో ప్రతిభ చూపిన 16 మంది సభ్యులను ఎంపిక చేసి, నవంబర్‌లో సింగరేణిలో జరిగే ఆల్ ఇండియా పోటీలకు రెండు జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1,2,3, ఏఎల్‌పీ జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్‌వీ సూర్యనారాయణ, ఎన్ సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, రెస్క్యూ జీఎం ఎస్ వెంకటేశ్వర్లు, సేఫ్టీ జీఎం గురువయ్య, సాంబయ్య, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం(ప) రాజేంద్రప్రసాద్, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, యూనియన్ నాయకులు ఐలీ శ్రీనివాస్, కే రాజ్‌కుమార్, దావు రమేశ్, ధర్మపురి, రాజారెడ్డి, యాదగిరి సత్తయ్య, సల్లా రాజేందర్, విశ్వనాథ్, టీ రాజు పాల్గొన్నారు.

## లక్ష్యసాధన దిశగా సాగాలి

- డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీనివాస్




డ్రాగ్‌లైన్ పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 10 : సంస్థ నిర్దేశిత లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని డైరెక్టర్ (ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్ అధికారులు, ఉద్యోగులకు సూచించారు. మంగళవారం ఏరియా జీఎం సూర్యనారాయణతో కలిసి ఓసీపీ-3 ప్రాజెక్టు స్థితిగతులను వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించారు. అలాగే డ్రాగ్‌లైన్ పని తీరును అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో ఓసీపీ-3 అతి పెద్ద ప్రాజెక్టు అని గుర్తుచేశారు. రక్షణ సూత్రాలు అమలుపరుస్తూ ప్రమాదాలను తగ్గిస్తూ ఉత్పతిత సాధించేలా పని చేయాలన్నారు. ఇంజినీర్ నర్సింహారావు, మేనేజర్ రమేశ్, సర్వే అధికారి నర్సింగరావు, డ్రాగ్‌లైన్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్ ఉన్నారు.

## 13 నుంచి శిక్షణ తరగతులు

మందమర్రి, అక్టోబర్ 10 : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వయం ఉపాధి శిక్షణ తరగతులను ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్, జ్యూట్ బ్యాగ్స్ తయారీలో 3 నెలల శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక ఎల్లెందు క్లబ్‌లో 13న ఉదయం 10 గంటలకు ప్రారంభ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్మికుల భార్యాపిల్లలు, మాజీ కార్మికుల పిల్లలు, ఏరియాలోని కేకే, ఆర్కే, శ్రావణ్‌పల్లి ఓసీ ప్రాజెక్టుల చుట్టుపక్కల గ్రామాల మహిళలు శిక్షణ కోసం అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తులను జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగం సేవా సమితిలో అందించాలని తెలిపారు.

# ప్రభావిత గ్రామాల్లో ‘సీజీజీ’ పర్యటన

- అభివృద్ధి పనుల పరిశీలన
- వివరాలపై అధికారులతో ఆరా



గోలేటి గ్రంథాలయం పరిశీలిస్తున్న సీజీజీ బృందం ప్రతినిధులు

రెబ్బెన, అక్టోబర్ 10 : బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి ప్రభావిత గ్రామాల్లో మంగళవారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రతినిధులు(జానకీరామ్-ప్రోగాం మేనేజర్), (దేవిసింగ్-సీనియర్ నాలెడ్జి మేనేజర్) పర్యటించినట్లు ఏరియా డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ముందుగా గోలేటిలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రంథాలయం, మహిళలు ఏర్పాటు చేసిన పేపర్ కటింగ్ సెంటర్, టైలరింగ్ సెంటర్లను, అలా చోపిడిలోని ఆరోగ్య కేంద్రం, విద్యా వలంటరీ సెంటర్, గడలపల్లిలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, క్రీడా మైదానం, సోలార్ వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. అనంతరం గోలేటి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మూడేండ్ల నుంచి సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, ఖైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు ఆధికారి సత్యనారాయణ, డీజీఎం(ఎఫ్అండ్‌ఏ) రామారావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, సీనియర్ పీవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా సమితి వృత్తి శిక్షకుల ఎంపిక

శ్రీరాంపూర్, అక్టోబర్ 10 : శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే వృత్తి శిక్షణ కోర్సులకు సంబంధించి శిక్షకులను మంగళవారం జీఎం సంజీవరెడ్డి ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. జీఎం ఆఫీస్‌లో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూకు మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ.. శిక్షకులను పారదర్శకంగా ఎంపిక చేశామన్నారు. శ్రీరాంపూర్‌లో శిక్షణ తీసుకున్న చాలా మంది మహిళలు సొంతగా యూనిట్లు పెట్టుకొని స్వయం ఉపాధి పొందుతున్నారని చెప్పారు. సేవా మహిళలు చేసిన పలు వస్తువులను హైదరాబాద్ ఎగ్జిబ్యూషన్‌లో కూడా ప్రదర్శించడం జరిగిందన్నారు. వివిధ 27 మంది దరఖాస్తులు చేసుకున్నారని, 26 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టూ జీఎం రఘుకుమార్, డీవైజీఎం అరవిందరావు, చిరంజీవులు, అకౌంట్స్ ఆఫీసర్ పద్మ, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

ఎంపికైన వృత్తి శిక్షకులతో జీఎం సంజీవరెడ్డి



## ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి



కేకే ఓసీ మ్యాప్‌లను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి

మందమర్రి, అక్టోబర్ 10 : సమష్టి కృషితో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. మందమర్రి ఏరియా జీఎం ఏ మనోహర్‌తో కలిసి మంగళవారం ఏరియాలోని కేకే ఓసీని సందర్శించారు. ఓపెన్ కాస్ట్ గని మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. యంత్రాల పని తీరును మెరుగుపర్చి నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఏజీఎం కేహెచ్‌ఎన్ గుప్త, కేకే ఓసీ ప్రాజెక్టర్ ఆఫీసర్ రమేశ్, డిప్యూటీ సూపరింటెండెంట్ సర్వే ఆఫీసర్ యూ ప్రకాశ్, జూనియర్ సర్వే ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఏరియాలో ప్రమోషన్లు..

రెబ్బెన, అక్టోబర్ 10 : బెల్లంపల్లి ఏరియాలో (2023లో) యాక్టింగ్ ఉద్యోగులకు వివిధ రకాల ప్రమోషన్లు కల్పిస్తున్నట్లు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని వివిధ గనులు, డిపార్టుమెంట్లలో ఏర్పడిన ఖాళీలు ప్రస్తుతం యాక్టింగ్ పని చేస్తున్న, అర్హత కలిగిన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యంతో టీబీజీకేఎస్ మాట్లాడి ప్రమోషన్లు ఇచ్చేందుకు కృషి చేసినట్లు తెలిపారు. పంపు ఆపరేటర్, శాంప్లింగ్ మజ్దూర్, ఈపీ గ్రీజర్, ట్రిప్‌మన్, ఆఫీస్ అటెండెంట్, రికార్డ్ అసిస్టెంట్, హెమ్ మజ్దూర్, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్, స్టోర్ ఇష్యూ మజ్దూర్ ఖాళీలు సాధించినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. అర్హత కలిగిన ఉద్యోగులకు వీలైనంత త్వరగా ప్రమోషన్లు ఇప్పించనున్నట్లు తెలిపారు.